క్లుప్తంగా

గుడ్‌కేర్ హోమ్‌కు వితరణ



సరకులు పంపిణీ చేస్తున్న గోపాలకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్వీ జనరల్ మార్కెట్‌కు చెందిన నల్లమిల్లి గోపాలకృష్ణ, దుర్గ దంపతుల కుమార్తె విజయ చైతన్య పుట్టిన రోజు వేడుకలను శనివారం బొమ్మూరులోని గుడ్ కేర్ హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌కేర్ హోమ్‌కు రూ.10 వేలతో పాటు సరకులు అందజేశారు. సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. హోమ్ నిర్వాహకులు కావూరి సురేష్ కుమార్, వరలక్ష్మి, వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ ర్యాక్ కపుల్స్ తరఫున భైరవస్వామి, రమేష్, జగదీష్ పాల్గొన్నారు.

రుణగ్రహీత ఇంటి ముందు బ్యాంకు అధికారుల నిరసన



బసవన్న చౌదరి ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వివిధ ఖాతాదారుల పేరున మోసపూరితంగా బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడంతో పాటు తిరిగి చెల్లించని ఖాతాదారుడి ఇంటి వద్ద బ్యాంకు ఆఫ్ బరోడా రాజమహేంద్రవరం రీజియన్ అధికారులు శనివారం నిరసన తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఉప్పలపాటి బసవన్న చౌదరి ఇంటి ముందు ఆ బ్యాంకు శాఖ అధికారులు ప్రదర్శన చేశారు. తీసుకున్న రుణాన్ని బాధ్యతగా త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్లకార్డులు పట్టుకుని రుణగ్రహీత తీరుపై నిరసన తెలిపారు. బ్యాంకు సొమ్ము అంటే ప్రజల సొమ్ము, వెంటనే రుణాన్ని తిరిగి చెల్లించాలి అంటూ నినాదాలు చేశారు.

శుద్ధి జలాలను అందించడమే లక్ష్యం



పంపుసెట్లను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

సీటీఆర్ఐ: గోదావరి నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు సకాలంలో అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పుష్కరాల రేవు వద్ద హెడ్ వాటర్ వర్క్స్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన టర్బన్ మోటారును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల సమయంలో గోదావరిలో నీటిమట్టం పెరిగినప్పుడు, వేసవిలో తగ్గుముఖం పట్టినప్పుడు పంపులు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించుకోవాలన్నారు. కార్పొరేషన్ అధికారులతో చర్చించి సబ్ మెర్సిబుల్ మోటారు స్థానంలో 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వర్టికల్ టర్బన్ మోటార్లను అమరిస్తే వరదలు, వ్యర్థాలు అడ్డు పడినప్పటికీ నీటిశుద్ధికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

సౌభ్రాతృత్వం పెంచడమే బౌద్ధం లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల మధ్య సౌభ్రాతృత్వం పెంచడమే బౌద్ధం లక్ష్యమని ప్రముఖ బౌద్ధ ప్రవచకులు బంతేజీ అనాలియా అన్నారు. నగరంలోని శనివారం నిర్వహించిన కఠిన చీవర దాన వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ధర్మ ప్రవచనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంద్రియాలను అదుపు చేసుకోవాలని బౌద్ధం చెబుతుందన్నారు. పౌరులందరూ కుల, మత, ప్రాంతీయ వాదాలకు అతీతంగా కలిసి మెలిసి జీవించాలన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో అతి పెద్ద బుద్ధుని విగ్రహం ఏర్పాటుకు, బుద్ధవిహార్ నిర్మాణానికి స్థలం కేటాయించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బుద్ధిస్ట్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు నయనాల కృష్ణారావు, కార్యనిర్వాహక సభ్యులు మద్రి బాజ్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ కార్పొరేటర్ పంతం కొండలరావు, డాక్టర్ గుబ్బల రాంబాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

రాజమహేంద్రవరం రూరల్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.రాజాబాబు అన్నారు. రాజవోలు గ్రామంలో శనివారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన భూసర్వేలో లోపాలుంటే ఈ గ్రామ సభల ద్వారా సరిచేసుకోవాలన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై 24 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ భువనేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంకం ప్రసాద్ పాల్గొన్నారు.

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం

- డంపింగ్ యార్డులా గోదావరి గట్టు
- రోడ్డు పక్కనే వ్యర్థాలు
- ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు



ఏటిగట్టు రోడ్డు పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

ధవళేశ్వరం: ఒకప్పుడు గోదావరి పక్క నుంచి ప్రయాణం అంటే చక్కని అనుభూతి కలిగేది. ఆ దారిలో వెళ్లే వారు గోదావరి అందాలను ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించేవారు. చల్లని గాలి, గోదావరి అందాలు, దారిలో స్వాగతం పలికే చెట్లను చూస్తూ ఉత్సాహంగా ముందుగా సాగేవారు. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే భయపడుతున్నారు. ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వరకూ గోదావరి గట్టును ఆనుకుని నిర్మించిన రోడ్డు పరిస్థితి ఇది.

పెరిగిన జనాభా

రాజమహేంద్రవరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, బతుకుదెరువు కోసం నగరానికి అనేక మంది వలస వస్తున్నారు. జనాభా పెరగడంతో రద్దీ బాగా ఎక్కువైంది. నగరానికి ఆనుకున్న ఉన్న ధవళేశ్వరంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పెరిగిన జనాభా నేపథ్యంలో వాహనాల రద్దీ కూడా ఎక్కువైంది. ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరానికి వెళ్లేందుకు ప్రధాన రహదారికి సమాంతరంగా గోదావరి గట్టు వెంబడి రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు మీదుగా ప్రతి రోజూ వేలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు రాకపోకలు సాగిస్తుంటాయి.

ట్రాఫిక్ సమస్య లేకుండా..

గోదావరి గట్టు రోడ్డు కారణంగా ప్రధాన రహదారికి ట్రాఫిక్ సమస్య బాగా తగ్గింది. చాలామంది ద్విచక్ర వాహన చోదకులు, కార్ల యజమానులు ఈ రోడ్డుపైనే రాజమహేంద్రవరానికి వెళ్లిపోతుంటారు. దీని వల్ల ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతోంది. ఇటీవల కాలంలో గోదావరి గట్టు రోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

తీవ్ర దుర్గంధం

గోదావరి గట్టు రోడ్డు పక్కనే వ్యర్థాలను వేయడం వల్ల తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. వాహన చోదకులు ముక్కు మూసుకుని ప్రయాణం సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో కూడా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ముఖ్యంగా మలుపులు ఉన్నచోట ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.

నిర్వహణ లేక..

గోదావరి గట్టుపై పెరిగిన పిచ్చిమొక్కలను ఇరిగేషన్ అధికారులు గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రం చేయించేవారు. దీంతో రోడ్డు పరిశుభ్రంగా, చక్కగా కనిపించేంది. కానీ ప్రస్తుతం రోడ్డు నిర్వహణను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రయాణానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. అలాగే రాత్రి వేళల్లో పాములు సంచరిస్తున్నాయి.

చీకటిమయం

ఏటిగట్టు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలను ఏర్పాట్లు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. రాత్రి వేళల్లో చీకటిలో ఇబ్బందులు తప్పుతాయి. ఏటిగట్టు రోడ్డు విస్తరణ జరిగితే ట్రాఫిక్ కష్టాలు మరింత తగ్గే అవకాశం ఉంది. ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద నుంచి రాజమహేంద్రవరం వరకు ప్రస్తుతం ఏటిగట్టు రోడ్డు ఉంది. దీనిని కాటన్ బ్యారేజీ వరకూ పొడిగించాలని గతంలో ప్రతిపాదన వచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ధవళేశ్వరం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇక్కట్లు తప్పుతాయి.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరావు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా శనివారం విజిలెన్స్ వారోత్సవాల ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి నిర్మూలనపై ప్రజలందరికీ అవగాహన కల్పించడం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, గ్రామాలతో సభల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వైద్యుడు రామారెడ్డికి సత్కారం



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

కంబాలచెరువు: నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యుడు, నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డిని గోదారోళ్ల కితకితలు గ్రూపు అడ్మిన్లు, మోడరేటర్లు శనివారం ఘనంగా సన్మానించారు. రామారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు అడ్మిన్ హిమాయత్ మహ్మద్ మాట్లాడుతూ డాక్టర్ రామారెడ్డి తన వైద్య వృత్తిలో ఎంతో బిజీగా ఉన్నా నిత్య విద్యార్థిగా యువతకు స్ఫూర్తినిస్తున్నారన్నారు. మోడరేటర్ పరస జగన్నాథరావు మాట్లాడుతూ రామారెడ్డి ఐఐటీల్లో ఒకేసారి 12 సర్టిఫికెట్ కోర్సుల్లో నమోదు చేసుకున్నారని, ఇటీవల జరిగిన నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. గతంలో ఉన్న 38 డిగ్రీలకు అదనంగా మరో నాలుగు డిగ్రీలు చేరడంతో డిగ్రీలు, డిప్లమోల జాబితా 42కు చేరిందన్నారు. మన నగరానికి విశ్వఖ్యాతిని తెస్తున్న డాక్టర్ రామారెడ్డి మరిన్ని డిగ్రీలు సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కార్యక్రమంలో సాన కృష్ణార్జునుడు, విజయ్ ఇర్లపాటి, బండారు సతీష్ పాల్గొన్నారు.

చెట్టు కూలినా పట్టించుకోరా...



మసీదు వీధిలో కూలిన చెట్టు

సీటీఆర్ఐ: ఆ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయి రెండు రోజులైంది. ఆ దారిలో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కానీ కూలిన చెట్టును తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు . వివరాల్లోకి వెళితే.. వర్షం కారణంగా శుక్రవారం మల్లయ్యపేటలోని మసీదు వీధిలో చెట్టు కూలిపోయింది. జనావాసాలపై పడినప్పటికీ అదృష్టవశాత్తూ ఎవ్వరికి ప్రమాదం జరగలేదు. విద్యుత్ తీగలపై పడడంతో సర్వీసు వైర్లు, కేబుళ్లు తెగిపోయాయి. రహదారికి అడ్డుగా పడటంతో ఆ మార్గం మీదుగా ప్రయాణించడానికి వీలు లేకుండా పోయింది. చెట్టు కూలిపోయిన భవనంలోని వారు బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. చెట్టు కూలిపోయిన విషయాన్ని రెండు రోజుల క్రితమే నగరపాలక సంస్థ సిబ్బందికి తెలియజేసినా ఫలితం లేకుండా పోయింది. అదే వీధిలో మసీదు ఉండటంతో, ప్రార్థన కోసం అక్కడకు వెళ్లడానికి ముస్లింలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు స్పందించి, కూలిపోయిన చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'ఇదండీ సంగతి' షార్ట్ ఫిల్మ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ గంగాధర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వైజాగ్ షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ షార్ట్ ఫిల్మ్స్ ఫెస్టివల్ అవార్డ్స్‌కు రాజమహేంద్రవరం నుంచి గంగాధర్ గుడుగోయిల డైరెక్ట్ చేసిన 'ఇదండీ సంగతి' షార్ట్‌ఫిల్మ్ ఎంపికైంది. ఈ మేరకు విశాఖపట్నంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైజాగ్ షార్ట్‌ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి డైరెక్టర్ గంగాధర్‌కు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ దేశానికి రైతే రాజు అంటారు కానీ.. వారు అడుగడుగునా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులను సమాజంలో కొందరు ఎలా వేధిస్తున్నారనే విషయాన్ని కళ్లకు కట్టినట్టు చూపించామన్నారు. తూర్పుగోదావరి జిల్లా యాసలో చక్కని ఎమోషన్, సెంటిమెంట్, కామెడీతో ఈ లఘుచిత్రాన్ని తీసినట్టు తెలిపారు. నటీనటులు రామకృష్ణ పులప, డి.శ్రీనివాస్, స్వర్ణ, బ్లేడ్ బ్యాచ్ సాయి, దేవాప్య మాట్లాడుతూ షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ కథను వెబ్ సిరీస్‌గా మరింత మందికి చేరేలా రెడీ చేస్తున్నామన్నారు.

చంటియ్య మృతి తీరని లోటు



చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

కడియం: నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా, పూల వర్తక సంఘం అధ్యక్షుడిగా పుల్లా సత్యనారాయణ (చంటియ్య) చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. కడియపులంకలో చంటియ్య కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చంటియ్య సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, నాయకులు తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, ఈలీ గోపాలం, కొత్తపల్లి శివాజీ, బోడపాటి సత్తిబాబు, పాలపర్తి ప్రకాష్, కిరణ్ కుమార్ ఉన్నారు.

మంత్రి కందుల దుర్గేష్ పరామర్శ

నర్సరీ రంగ ప్రముఖుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరామర్శించారు. చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దుర్గేష్ వెంట స్థానిక నాయకులు ఉన్నారు. అలాగే మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జనసేన జగ్గంపేట నాయకుడు తుమ్మలపల్లి రమేష్, మాధవరాయుడపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తదితరులు పరామర్శించారు.

టెక్నాలజీపై అవగాహన అవసరం

సీతానగరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ముఖ్యంగా టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై డి.రామ్ కుమార్ అన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై రామ్ కుమార్ మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా నేరగాళ్లు అనేక మార్గాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లలో వ్యక్తిగత చిత్రాలను, వివరాలను పంపవద్దన్నారు. కొత్తకాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, తెలియని వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. డబ్బులు సంపాదించవచ్చంటూ కొందరు మోసగాళ్లు లింక్‌లను పంపిస్తున్నారన్నారు. వాటిని నమ్మి క్లిక్ చేస్తే తీవ్రంగా నష్టపోతామని హెచ్చరించారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు

గైట్‌లో డిప్లమో కోర్సులు

రాజానగరం: వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులు ప్రారంభించనున్నామని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన వారు, అలాగే రెండేళ్ల ఐటీఐ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. లెటరల్ విద్యార్థుల మాదిరిగానే నేరుగా ద్వితీయ సంవత్సరం పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశిస్తారన్నారు. ఈ నెల 21 నుంచి 26 వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు నేరుగా ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజాన్ని సంప్రదించాలని, లేకుంటే 88866 60481 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

అట్లతద్దె సందడి



అట్లతద్దె సందర్భంగా పుష్కరాలరేవులో మహిళల రద్దీ

సీటీఆర్ఐ: అట్లతద్దె సంబర్భంగా పుష్కరాల రేవు శనివారం కిటకిటలాడింది. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఒకరికి ఒకరు అట్లను వాయనంగా ఇచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఘాట్లలోని మెట్లపై పూజలు జరిపారు.

మహిళలు పూజలు

కడియం: అట్లతద్దెను పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు కాలువ రేవులు, చెరువుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే ఉపవాస వ్రతాన్ని ప్రారంభించారు. సాయంత్రం చీకటిపడ్డాక రేవుల్లో గౌరీ పూజల అనంతరం చుక్కను చూసి ఉపవాస వ్రతాన్ని విరమించారు. కడియంలోని బ్రాహ్మణరేవు, కడియపులంక, దుళ్ల గ్రామాల్లోని కాలువ రేవుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. కడియం శివాలయం వద్ద గల గోశాలలో ఆవులకు పూజలు చేశారు.



పుష్కరాలరేవులో మెట్లపై పూజలు చేస్తున్న మహిళలు



కడియంలో గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు



పుష్కరాలరేవులో పూజలు చేస్తున్న మహిళలు

నర్సరీని సందర్శించిన ఐజీ రవిప్రకాష్



ఐజీ రవిప్రకాష్ దంపతులకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతు పల్ల సత్తిబాబు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఐజీ (పీఅండ్ఎల్) జి.రవిప్రకాష్ దంపతులు శనివారం సందర్శించారు. నర్సరీ రైతులు పల్ల సత్యనారాయణ మూర్తి, వినయ్ వారికి ఘన స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాజాబాబు



రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఏ.రాజాబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొవ్వూరు పోలవరం ప్రాజెక్టు ఆర్ఎంసీ యూనిట్-1 డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న జేఎస్ లక్ష్మీరమ్య డీఎస్‌వో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అలాగే ప్రస్తుతం రూరల్ మండల తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో రాజాబాబు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కూడా వ్యవహరిస్తారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు



బీజేపీ క్రియాశీలక సభ్యత్వం స్వీకరిస్తున్న సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతాపార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదును క్షేత్రస్థాయిలో మరింత ఉత్సాహంగా నిర్వహించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పిలుపు నిచ్చారు. ఒకటో డివిజన్ 101వ పోలింగ్ బూత్‌లో వందకు పైబడి సాధారణ సభ్యత్వాలను పూర్తి చేసిన సందర్భంగా ఆయనకు జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పార్టీ క్రియాశీలక సభ్యత్వం అందించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ బీజేపీ సాధారణ సభ్యత్వాల నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 2 నుంచి దేశవ్యాప్తంగా మొదలైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వాల నమోదులో తూర్పుగోదావరి జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో బేతిరెడ్డి ఆదిత్య, కాలెపు సత్యసాయిరామ్, కందికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మౌనం వీడాలి



అత్తిలి రాజు

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని సంచలన ప్రకటన చేసిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తిలి రాజు ప్రశ్నించారు. తిరుమల విషయంలో రాజకీయం కావాలో, పరిష్కారం కావాలో ఆయన తేల్చుకోలేక పోతున్నారన్నారు. లడ్డూ విషయంలో చంద్రబాబు స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇప్పటికే సీబీఐ, సీఐడీ సంయుక్త విభాగాల ఆధ్వర్యంలో కోర్టు దర్యాప్తునకు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తిరుమలలో ప్రభుత్వం సొంతంగా పాల డెయిరీని ఏర్పాటు చేయాలని, అందుకు వెయ్యి గోవులను తిరుమలకు దానంగా ఇస్తానని చేసిన ప్రకటనపై సీఎం చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదన్నారు.

సినిమాలు



శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జిగ్రా
సూర్యప్యాలెస్	: ఇద్దరు
శివజ్యోతి	: మార్టిన్
అనుశ్రీ	: జనక అయితే గనక
స్వామి	: శ్వాగ్
అశోక	: విశ్వం
రాజా	: మార్టిన్
రంభ	: రాధేకృష్ణ, మా నాన్న సూపర్ హీరో
ఊర్వశి	: సత్యం సుందరం
మేనక	: కల్లు కాంపౌండ్, మార్టిన్
కుమారి	: దేవర
అప్సర నామవరం	: దేవర
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: వేట్టయన్, విశ్వం
మురళీకృష్ణ కడియం	: దేవర
వెంకటసూర్య	: దేవర, వేట్టయన్